నిర్బంధ పాలన ఇంకెన్నాళ్లు

- అక్రమ అరెస్ట్‌లతో నిరసనలు ఆపలేరు
- బీఆర్ఎస్ రాష్ట్రనేత కంచర్ల రవిగౌడ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 27: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్బంధ పాలన ఇంకెన్నాళ్లు కొనసాగుతుందో చూస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్ అన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్ నాయకులను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడవకముందే రాష్ట్రంలోని గురుకులాల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని వాపోయారు. పలుచోట్ల విద్యార్థులు ఆరోగ్య పరిస్థితి విషమించి ప్రాణాలు వదిలిన సందర్భాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలన్న డిమాండ్‌తో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడం సరైందికాదన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు మట్టి శ్రీనివాస్, ముద్దం అనిల్, దేవరాజు, తదితరులున్నారు.

రహదారి విస్తరణకు కొలతలు

- ముందస్తు సమాచారం లేకుండా వచ్చారని నిర్వాసితుల ఆవేదన

వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణకు కొలతలు వేస్తున్న సిబ్బంది

వేములవాడ, నవంబర్ 27: వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ చేపట్టేందుకు సిబ్బంది బుధవారం కొలతలు వేశారు. అయితే వేములవాడ మూలవాగు అమరవీరుల స్తూపం నుంచి రాజన్న ఆలయం వరకు రహదారి విస్తరణకు ఇప్పటికే 47 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే రెండుసార్లు కొలతలు వేసి అంచనాలు వేసిన మరోసారి బుధవారం సిబ్బంది కొలతలు వేశారు. దుకాణాలు, ఇండ్లు కోల్పోతున్న యజమానులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కొలతలు వేయడం ఎంతవరకు సమంజసం అని వాపోయారు. కొలతలను కూడా సరిగ్గా అవగాహన లేకుండా వేస్తున్నారని ఆరోపించారు. సుమారు 20 భవనాల వరకు సదరు సిబ్బంది కొలతలు వేసినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు కొలతలు వేసినట్లు తెలిసింది.

గంభీరావుపేటను సందర్శించిన ఐఏఎస్ శిక్షణ అధికారులు

రామాలయంను సందర్శించిన ఐఏఎస్ శిక్షణ అధికారులు

గంభీరావుపేట, నవంబర్ 27: గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీతోపాటు విద్యాలయాలను బుధవారం సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు సందర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులు శిక్షణలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయం, డిగ్రీ, పీజీ కళాశాలతోపాటు శ్రీ సీతారామాలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్‌లు ఉత్సవ్‌పరచూర్, అక్షిత్ జైన్, ప్రాచీకుమారి, నారాయణ్, శివంప్రకాశ్, ఈవో లక్ష్మణ్ ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు

మాట్లాడుతున్న నాయకులు అజ్జ వేణు, కడారి రాములు

కలెక్టరేట్, నవంబర్ 27: జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజ్జ వేణు, కడారి రాములు కోరారు. ఈ మేరకు బుధవారం ఏఐటీయూసీ కార్మిక భవన్ సుభాష్‌నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు బోన్ టెస్ట్ చేసి ఏజ్ నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగిందని కానీ రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందించడం లేదన్నారు. కావున వెంటనే టెస్ట్ రిపోర్ట్‌ల ఆధారంగా ఆయాలు, టీచర్లకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో మీసం లక్ష్మణ్, జక్కుల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నమూనా పోలింగ్ నిర్వహణ

వేములవాడ రూరల్, నవంబర్ 27 : వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి ప్రభుత్వ పాఠశాలలో నమూనా పోలింగ్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన మాక్ పోలింగ్‌లో 120 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా గ్రీష్మ, దేవి ప్రసాద్ వ్యవహరించారు. ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రేపు మహాపడిపూజ

సిరిసిల్ల టౌన్, నవంబర్ 27: జిల్లా కేంద్రంలో ఈ నెల 29న మహాపడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి గూడెపు లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సాయికృష్ణ కల్యాణ మండపంలో జరిగే పడిపూజలో అయ్యప్ప స్వామికి చెరుకు రసంతో అభిషేకంతోపాటు జిల్లాలోని 600మంది స్వాములను సన్మానిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప భక్తులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు. శ్రీ కోలపురం నర్సయ్య, S/o. లస్మయ్య, R/o. చంద్రంపేట, సిరిసిల్ల పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుమన్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన గూన ఇల్లు మరియు దీని ఖాళీ స్థలం కలిపి మొత్తం విస్తీర్ణం: 400 చ॥గ॥ (H.No. 3-3-132), కుమ్మరి గల్లి, సిరిసిల్ల పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కల దానిని నాక్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తి పై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో. ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని దృవీకరించబడును.

తేది: 27-11-2024 స్థలము: సిరిసిల్ల

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.
వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

వేములవాడ రూరల్, నవంబర్ 27 : బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని హన్మాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దివ్యశ్రీ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట జడ్పీహెచ్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దివ్యశ్రీ మాట్లాడుతూ, బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమన్నారు. అవగాహన లేకుండా బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు గంగమరాజు, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, సిబ్బంది గాయిత్రి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు ఇక భద్రమేనా..!

- గత అక్టోబర్ 24న ఉండే లెక్కింపులో బయటపడిన డొల్ల తనం
- భద్రతా సిబ్బంది నడుమ ఖాళీ సంచులపై పర్యవేక్షణ

వేములవాడ రాజన్న ఆలయ హుండీ లెక్కింపులో ఖాళీ సంచుల వద్ద పరిశీలిస్తున్న భద్రత సిబ్బంది, ఆలయ ఉద్యోగి

వేములవాడ, నవంబర్ 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో హుండీ లెక్కింపు ఇక భద్రమేనా అంటే.. సరియైన సమాధానం మాత్రం లేదనే చెప్పవచ్చు. గత అక్టోబర్ 24వ తేదీన జరిగిన హుండీ లెక్కింపులో ఒప్పంద ఉద్యోగి వ్యవహారం వెలుగు చూడగా దానిని అధికారులు ముందు కాస్త తొక్కిపెట్టి మీడియాలో బహిర్గతం కావడంతో సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామని ఆలయ అధికారులు వెల్లడించిన తీరు డొల్లతనానికి నిదర్శనం. స్వామివారి హుండీల నుంచి నగదును ఖాళీ సంచుల ద్వారా లెక్కింపు కేంద్రానికి తరలించిన అనంతరం సంచులను మళ్లీ తిరిగి మడత పెట్టే క్రమంలో ఈసారి మాత్రం కాస్త ఆలయ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఖాళీ సంచులను పరిశీలించేందుకు ఉద్యోగితోపాటు భద్రతా సిబ్బందిని కూడా ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఇంతవరకు బాగానే ఉన్నా హుండీ లెక్కింపులో మహిళల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండగా అసలు హుండీ లెక్కింపులో మహిళలు పాల్గొనరాదని నిబంధన ఉన్నప్పటికీ ఆలయ అధికారులు దృష్టి సారించకపోవడం భద్రతపై అనుమానాలకు తావిస్తున్నది. ఇందులో పూర్తిగా స్వామివారి సేవకు వచ్చే వారు మాత్రమే విధులు నిర్వహిస్తుండడం గతంలో జరిగిన పొరపాట్లను ఏ మేరకు సరిదిద్దుకొని విధులు కేటాయిస్తున్నారు అనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఏది ఏమైనా హుండీ లెక్కింపులో కట్టుదిట్టమైన భద్రత, సూక్ష్మస్థాయి పరిశోధన తప్పనిసరిగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హుండీ లెక్కింపులో జరిగిన వ్యవహారంపై పోలీసు విచారణకు ఆదేశించిన ఆలయ అధికారులు అది ఏ మేరకు సాగింది అనే అంశాన్ని కూడా ఆరా తీయకపోగా, పూర్తిస్థాయిలో విచారణ జరిపి లోతైన అంశాలను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. స్వామివారి కానుకలకు భద్రత కల్పించి భక్తులకు విశ్వాసాన్ని కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు భావించాలని కూడా భక్తులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

తెలంగాణ చౌక్, నవంబర్ 27: రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ తిరుపతి అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. వచ్చే నెల 7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి టీంను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఇక్కడ దేవత ప్రభాకర్, శ్రీనివాస్, మహేశ్, అనిల్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, నవంబర్ 27 : బెజ్జంకి మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామ శివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మండలంలోని రేపాక గ్రామ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రావాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బెజ్జంకి మండలం ముత్తన్నపేట గ్రామానికి చెందిన కనగాండ్ల రంజిత్ పై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమావేశ వేదిక నిర్మాణానికి భూమి పూజ

కోనరావుపేట, నవంబర్ 27: మండలంలోని కనగర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశ వేదిక నిర్మాణానికి ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పాఠశాలలో నిర్వహించే సమావేశాలకు వేదిక ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

సోషల్ ఆడిట్ పకడ్బందీగా చేయాలి

బోయినపల్లి, నవంబర్ 27 : మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ పకడ్బందీగా చేయాలని జడ్పీ సీఈవో వినోద్‌కుమార్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో 2021 నుంచి 2024 వరకు జరిగిన రూ.4కోట్లా 58 లక్షలకు సంబంధించిన 15వ విడుత సామాజిక తనిఖీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో మాట్లాడుతూ, సోషల్ ఆడిట్ నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో జయశీల, ఎస్ఆర్‌పీ భగవంతరావు, ఏపీవో సబిత, కార్యదర్శులు, డీఆర్‌పీలున్నారు.

చదువులో వెనుకబడ్డానని మనస్తాపం బాలిక ఆత్మహత్య

అక్షిత(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 27: దేవునిగుట్ట తండా పంచాయతీ పరిధిలోని చింతకుంట తండాకు చెందిన మాలోత్ అక్షిత(17) చదువులో వెనుకబడ్డానని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. బంధువుల వివరాల ప్రకారం, దేవునిగుట్ట తండాకు చెందిన మాలోత్ మంజుల కూతురు అక్షిత గతేడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలో సబ్జెక్టులు తప్పాయి. అప్పటినుంచి ఇంటివద్దే ఉంటోంది. అనంతరం సప్లిమెంటరీ పరీక్షలో కూడా పాస్ కాకపోవడంతో మనోవేదనకు లోనైంది. దీంతో ఈనెల 20వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండల కేంద్రంలోని అశ్వినీ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు ఘటనపై వివరాలు సేకరించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం
పోలీస్ సబ్ డివిజన్‌కు కేటాయింపు

- భవనంలో ప్రత్యేక పూజలు చేసిన ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి

వేములవాడ, నవంబర్ 27: వేములవాడ పట్టణంలోని బాలానగర్ ప్రాంతంలో ప్రభుత్వం కోటి రూపాయలతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ భవనాన్ని వేములవాడ పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయానికి అధికారులు కేటాయించడంతో బుధవారం ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి కార్యాలయం ఏర్పాటు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి బైపాస్ రహదారిలో ఉన్న అద్దె కార్యాలయాన్ని ఇక ఖాళీ చేసి వేములవాడ పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగించనున్నారు. కార్యక్రమంలో సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు అంజయ్య, రమేశ్, ప్రశాంత్ రెడ్డి, రాజు తదితరులు హాజరై ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యాలయానికి కేటాయించిన భవనం

భవనంలో పూజలు చేసిన ఏఎస్పీ శేషాద్రిని రెడ్డిని ఆశీర్వదిస్తున్న పూజారులు

కిడ్నీ బాధితుడికి రూ.50వేల సాయం

కోనరావుపేట, నవంబర్ 27: ఆపదలో ఉన్న వారికి రూ.50వేలు ఆర్థిక సాయం అందించి మానవాత్వాన్ని చాటుకున్నాడు బెంగుళూరు వాసి. వివరాల్లోకి వెళితే, కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కదిరె మహేందర్ రెండు కిడ్నీలు చెడిపోయి హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో వైద్య ఖర్చుల కోసం రూ.30లక్షలు అవసరమని వైద్యులు చెప్పగా, దాతల సాయం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో బుధవారం 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో ఆపన్నహస్తం అందించండి అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కాగా బెంగూళురుకు చెందిన సుజీత్ క్రోయేషియా దేశంలో ఉపాధి కోసం వెళ్లాడు. అక్కడే ఉన్న నిజామాబాద్ గ్రామానికి చెందిన యువకుడు బద్దెపురం మల్లేశం తన వాట్సాప్ ద్వారా సుజీత్‌కు పంపించాడు. స్పందించిన సుజీత్ వెంటనే తన ఫోన్ పే ద్వారా రూ.50 వేలను ఆపదలో ఉన్న కదిరె మహేందర్‌కు పంపించి మానవత్వాన్ని చాటుకున్నాడు. దీంతో మహేందర్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సుజీత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని వేడుకున్నారు.

ప్రకటనలకే పరిమితమైన కాంగ్రెస్

ముస్తాబాద్, నవంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నా, ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో నాసిరమైన భోజనంతోనే విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవుతున్నదన్నారు. నిత్యం ఏదో ఒకచోట ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు దవాఖానల పాలవుతున్నా ప్రభుత్వం నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం నిత్యం విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నా నిమ్మకునీరెత్తడంలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులున్నారు.

మృత్యువుతో పోరాడి..

- రెండు నెలలుగా అపస్మారక స్థితిలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు
- చికిత్స పొందుతూ మృతి

ఆశిష్(19)

వీర్నపల్లి, నవంబర్ 27: మిత్రుడిని కలువడానికి బయలుదేరిన ఓ యువకుడికి మృత్యువు ప్రమాద రూపంలో ఎదురైంది. రెండు నెలలుగా మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. ఒక్కగానొక్క కొడుకుని కాపాడుకోవడానికి ఆ తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మండలంలోని గర్జనపల్లికి చెందిన ఈసంపల్లి ఆశిష్(19) గత నెల 1న అడవి పదిరలోని మిత్రుడిని కలువడానికి బైక్‌పై బయలుదేరాడు. అడవి పదిర శివారుకు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆశిష్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండు నెలలుగా అపస్మారక స్థితిలోనే ఉండగా పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. దవాఖానలో దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసిన కొడుకు ప్రాణం నిలువకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గొర్రె కరుణ ప్రభుత్వాన్ని కోరారు.

నిబంధనల ప్రకారం 'పీఎం విశ్వకర్మ' అందించాలి

కలెక్టరేట్, నవంబర్ 27 : అర్హులకు నిబంధనల ప్రకారం పీఎం విశ్వకర్మ అందించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. పీఎం విశ్వకర్మపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఎంపీడీవోలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని అన్ని మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారి అప్లికేషన్, డిక్లరేషన్, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఇతర వివరాల ప్రింట్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జీఎం ఇండస్ట్రీస్‌కు పంపించాలని ఆదేశించారు. ఇక్కడ డీఆర్డీవో శేషాద్రి, ఇండస్ట్రీస్ ఏడీ భారతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఎల్డీఎం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను దహనం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

చందుర్తి, నవంబర్ 27: తిమ్మాపూర్-రామన్నపేట గ్రామాల శివారులో బుధవారం ఓ రైతుకు చెందిన విద్యుత్ మోటర్ స్టార్టర్‌ను ఎత్తుకెళ్లడంతో పాటు, విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, తిమ్మాపూర్ రైతు కుషాలు మోటర్ స్టార్టర్‌ను ఎత్తుకెళ్లి బోరు మోటర్ వైరును దహనం చేశారు. సామగ్రి విలువ దాదాపు సుమారు రూ.30 వేలు ఉంటుందని రైతు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

బోయినపల్లి, నవంబర్ 27: బోయినపల్లి ఆదర్శ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంతమంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు, బియ్యం కూడా ఏ విధంగా ఉన్నాయని చూసి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీని కోరారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి

చందుర్తి, నవంబర్ 27: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డీసీవో రామకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని మూడపల్లి,రామన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు తరలించిన ధాన్యం వివరాలు రైతుల నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

సింహగర్జనను విజయవంతం చేయాలి

ముస్తాబాద్, నవంబర్ 27 : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే సింహగర్జనను విజయవంతం చేయాలని మండల కేంద్రంలో మాల మహానాడు నేతలు పోస్టర్ ఆవిష్కరించారు. ఇక్కడ మండల మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కథల పోటీల్లో
ఆవునూర్ విద్యార్థుల ప్రతిభ

ఆవునూర్ పాఠశాలలో బహుమతి పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముస్తాబాద్, నవంబర్ 27 : తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ వారు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కథలు కవితల పోటీల్లో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవునూరు విద్యార్థి కే లక్ష్మీ ప్రసన్న(9వ తరగతి) రాసిన 'చదువు విలువ' అనే కథ ప్రత్యేక బహుమతిని అందుకుందని హెచ్ఎం మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. పాఠశాల చెందిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడంతో లక్ష్మీ ప్రసన్న రాష్ట్రస్థాయి బహుమతికి ఎంపిక కాగా 11 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు గురువులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మద్దికుంట లక్ష్మణ్ మాట్లాడుతూ, విద్యార్థులకు అంతర్గత సృజనాత్మక శక్తులు అందరికీ ఉంటాయని వాటిని బయటకు తీసుకురావడమే పాఠశాల ఉపాధ్యాయుల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, పరశురాములు, లక్ష్మీనారాయణ, గణేశ్, విశ్వనాథ్, సువర్ణ, కవిత, పద్మలత, మనోహర్, దీప్తి, కవిత, ప్రభాకర్, శ్రీలత, అనిల్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, నవంబర్ 27 : మండల కేంద్రానికి చెందిన తూంకుంట దుర్గారెడ్డి పది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబాన్ని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ బుధవారం పరామర్శించారు. వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేణు రావు, బీఆర్ఎస్ రెండు మండలాల అధ్యక్షులు పల్లె నర్సింహారెడ్డి, మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, సాదుల్, సలీం, రఘు, సత్తిరెడ్డి, వెంకటేశం, భాస్కర్, తూంకుంట మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలి

మల్లాపూర్ పాఠశాలలో విద్యార్థిని ప్రశ్నిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

బోయినపల్లి, నవంబర్ 27: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. బుధవారం బోయినపల్లి మండలం మల్లాపూర్ జడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సబ్జక్టుల వారీగా చేసిన విద్యా బోధనను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు జరిగిన విద్యా బోధనపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం డీఈవో రమేశ్‌కుమార్ మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కడపర్తి రామారావు,